క్లుప్తంగా

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: ఉపాధి సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 5న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వామపక్ష వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కోరారు. శనివారం నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో యర్రా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీకేఎంయూ జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, ఏఐఏడబ్ల్యూయూ జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ మాట్లాడారు. ఉపాధి హామీ చట్టంలో సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గన్యా తదితరులు పాల్గొన్నారు.

రేపు 'డేర్'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్..

ఖమ్మంరూరల్: మండలంలోని కొత్తూరులో గల డేర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 5వ తేదీన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దరిపల్లి కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని ప్రముఖ న్యూటెక్ ఇండస్ట్రీస్, ట్యాగ్ కార్పొరేషన్, యాప్లస్ టెక్నాలజీస్, ఫాబ్ ఇండస్ట్రీస్ హెచ్‌ఆర్ ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. బీటెక్, డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఇంటర్వ్యూలకు అర్హులని పేర్కొన్నారు.

23 నుంచి గురుపౌర్ణమి వేడుకలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని త్రీటౌన్ హర్కారా బావి రోడ్ రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణసాయి ఆశ్రమంలో ఈ నెల 23 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు గురుపౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆశ్రమం నిర్మాణ, నిర్వహణ కమిటీ చైర్మన్ లగడపాటి రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ షిరిడీ సాయి ఏకాదశ దీక్షలు, మాలధారణ, సాయి హోమాలను నిర్వహిస్తామని, భక్తులు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఖమ్మానికి చేరిన ధరణి పోర్టల్ బస్సుయాత్ర

ఖమ్మం మామిళ్లగూడెం: గత నెల 10 నుంచి ఈ నెల 10 వరకు ధరణి పోర్టల్‌పై సాధిక్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న బస్సుయాత్ర శనివారం ఖమ్మంకు చేరింది. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది, సామాజిక వేత్త సాధిక్‌అలీ మాట్లాడుతూ..ధరణి పోర్టల్ అణగారిన కులాలకు నష్టాన్ని కలిగించి, మరింత భూమి అగ్రకులాల చెంతకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ధరణి పోర్టల్‌లో కాస్తుకాలం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా పట్టాలను వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన మహాసభ నాయకులు లిక్కి కృష్ణారావు, మహిళా నాయకురాలు ఉపేంద్రమ్మ, సుధాకర్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ నిరీక్షణ ప్రార్థన మందిరంలో విశిష్ట సేవారత్న జాతీయ అవార్డు అందుకున్న ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ మహాసేన జిల్లా అధ్యక్షుడు మందా సంజీవరావును శనివారం తిమోతి గాస్పెలిటీ మినిస్ట్రీ వ్యవస్థాపకుడు ఎం.తిమోతి ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మానుకొండ సుదర్శన్, నేలల బాలస్వామి, ఐక్యవేదిక ఖమ్మం గౌరవ అధ్యక్షుడు వేముల సత్యం, చిన్ని డేవిడ్, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆదివాసీ నాయక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పసుల బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా కొమ్ముల బాపు, కోశాధికారిగా నాగరాజుతో పాటు ఇతర కార్యవర్గాన్ని శనివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను గిరిజనులకు అందేలా చూస్తానని, తన నియామకం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ కవిగా వీరబాబు

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారానికి చెందిన చిలకబత్తిని వీరబాబు జాతీయ స్థాయిలో ఉత్తమ కవిగా ఎంపికయ్యారు. ఏపీలోని విజయవాడలో ఇటీవల సూపర్‌స్టార్ కృష్ణ జీవితంపై నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో వంద మంది పాల్గొనగా 14మందిని ఎంపిక చేశారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర రచయితల సంఘం అధికార ప్రతినిధి వీరబాబుకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఆయనను శనివారం మండల కేంద్రంలో పలువురు సన్మానించారు.

నగరంలో సినిమాలు

వినోద	నేను స్టూడెంట్ సర్
సాయిరాం	అహింస
ఆదిత్య	బిచ్చగాడు 2
శ్రీనివాస	మేమ్ ఫేమస్
సుందర్	చక్రవ్యూహం

- ఖమ్మంవ్యవసాయం

ఆకాశమే హద్దుగా..



ఆరేళ్లకే అర్చనకు అవార్డుల పంట

- భరతనాట్యం, ఆంధ్రా నాట్యం, పేరిణి, జానపద కళా నృత్యాల్లో ప్రతిభ చాటుతున్న చిన్నారి
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న వైనం
- ఏడాది కాలంలో 100కు పైగా ప్రదర్శనలు



ఏడాది కాలంలో సాధించిన అవార్డులతో అర్చన (ఇన్‌సెట్) అఖిల భారత తెలుగు సాంస్కృతిక సంస్థ ద్వారా అవార్డును అందుకుంటున్న అర్చన(ఫైల్)



నృత్యం చేస్తూ..

ఖమ్మంగాంధీచౌక్: నాలుగేళ్ల వయస్సులోనే కాలికి గజ్జె కట్టి.. ఆరేళ్ల వయస్సు కల్లా అద్భుతాలను సృష్టిస్తోంది.. భిన్నమైన నృత్య ప్రదర్శనలు చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూ అవార్డులను సొంతం చేసుకుంటుంది. ఆ చిన్నారి ఎవరో కాదండి.. ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ముంజాల శ్రీను, ఉమ దంపతుల కుమార్తె ముంజాల అర్చన. అతి పిన్న వయస్సులోనే భరతనాట్యం, పేరిణి నృత్యం, ఆంధ్రా నాట్యం, జానపద కళా నృత్యాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అద్భుత ప్రదర్శనలు కనపరచి రివార్డులు, అవార్డులు, మెడల్స్ సాధిస్తోంది.

ఏడాది శిక్షణతోనే..

నృత్యంలో చిన్నారి ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు ఖమ్మం నగరంలోని లలిత డ్యాన్స్ అకాడమీలో చేర్పించి మాస్టర్ వీరునాయక్ వద్ద శిక్షణ ఇప్పిస్తున్నారు. అంతేగాక యూట్యూబ్‌లో చూసి చిన్నారి ఇంట్లో కూడా జానపద కళా నృత్యాలు నేర్చుకుంటోంది. కేవలం ఒక్క సంవత్సరంలోనే శాస్త్రీయ నృత్యం నేర్చుకోవడం విశేషం. ఓ వైపు గూగుల్ కిడ్స్ ప్రైమరీ స్కూల్‌లో కేజీ విద్యను అభ్యసిస్తూనే.. మరోవైపు ఖాళీ సమయంలో నృత్యం నేర్చుకుని ఏడాది కాలంలోనే అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సొంతం చేసుకుంటోంది. అర్చన నృత్యాలు, అవార్డులను చూసిన వారంతా అవాక్కవుతుండడంతో పాటు మరింతగా ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నారు.

సండే స్పెషల్



అర్చనను అభినందిస్తున్న మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, పక్కన అర్చన తల్లిదండ్రులు(ఫైల్)

అవార్డుల పంట..

చిన్నారి అర్చన ఏడాది కాలంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో 100కు పైగా ప్రదర్శనలు ఇచ్చి అనేక అవార్డులు సొంతం చేసుకుంది. వాటిలో ప్రధానమైనవి..

- 2023 మార్చి 22న అజంత ఎల్లోరా ఇంటర్నేషనల్ ఆర్ట్ గ్యాలరీ, ఛత్రపతి సంబంజీ నగర్ ఔరంగాబాద్‌లో ఇచ్చిన బెస్ట్ క్లాసికల్, ఫోక్ డ్యాన్స్ ప్రదర్శనకు అర్చన రవీంద్రనాథ్ ఠాగూర్ కళావిభూషణ్ అవార్డు సాధించింది.
- ఇండియా బుక్ ఆఫ్ రికార్డు భరతనాట్యం ముద్రలు, సంయుక్త, అసంయుక్త హస్త ముద్రలను సైగలతో 52 ముద్రలను కేవలం 24 సెకండ్లలో చెప్పింది. ఈ కార్యక్రమం 2023 ఫిబ్రవరి 22న న్యూఢిల్లీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియాలో ప్రదర్శించి రికార్డును సొంతం చేసుకుంది.
- తక్కువ సమయంలో 100కు పైగా శాస్త్రీయ నృత్య ప్రదర్శనలకు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 2023 మార్చి 4న ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు లిటిల్ ఛాంప్–2023ను సాధించింది.
- నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ భారత్ విభూషణ్‌ను బెస్ట్ క్లాసికల్ డ్యాన్సర్‌గా 2023 మార్చి 10న న్యూఢిల్లీలో సాధించింది.
- గ్లోబల్ ఎచీవర్స్ అవార్డు తమిళనాడు ప్రభుత్వంచే పొందింది. ఏడాది కాలంలోనే 100కు పైగా నృత్య ప్రదర్శనలు, అవార్డు, రికార్డులు, ట్రోఫీలు సాధించినందుకు గాను 2023 మార్చి 28న నేషనల్ బుక్ రికార్డ్ భారత్ విభూషణ్‌ను కైవసం చేసుకుంది.
- బెంగుళూర్ హీనా డ్యాన్స్ అకాడమి ద్వారా 2023 జనవరి 21న భారత్ నృత్య సమ్మాన్ అవార్డు పొందింది.
- నేషనల్, ఇంటర్నేషనల్ అవార్డు 2023 మార్చి 1న సోషియల్లీ పాయింట్ ఫౌండర్ ఇండోర్‌లో ఫ్రైడే ఆఫ్ ఇండియా అవార్డు సాధించింది.
- బెస్ట్ ఫోక్, క్లాసికల్ అవార్డు వర్తి విల్‌నెస్ ఫౌండేషన్ న్యూఢిల్లీలో 2023, ఫిబ్రవరి 25న రాష్ట్రీయ ప్రతిష్ట పురస్కార్ అవార్డు సాధించింది.
- 2023 ఫిబ్రవరి 10న రాజస్థాన్‌లో ఏజీఎల్ ప్రజెంట్ ఇంటర్నేషనల్ బెస్ట్ డ్యాన్సర్ అవార్డు పొందింది.
- బైసఖి స్పెషల్ ఎస్‌ఆర్ డ్యాన్స్ స్టూడియో బెస్ట్ భరతనాట్యంలో ఒడిషాలో 2023, ఏప్రిల్ 1న సంగీత కళాభూషణ్ అవార్డు పొందింది.
- చైల్డ్ ట్రాక్ తమిళనాడులో నిర్వహించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును బెస్ట్ క్లాసికల్ డ్యాన్సర్‌గా 2023, ఏప్రిల్ 19న పొందింది.
- తెలంగాణ బాల రత్న అవార్డును తెలంగాణ శాస్త్రీయ నృత్యంలో ప్రతిభ కనపరిచినందుకు గాను, ఏబీపీఎస్ సమాఖ్య సాంస్కృతిక సేవాసంస్థ విశాఖపట్నం అవార్డు హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో అందించారు.

వ్యవసాయ రంగంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణలో వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతి స్వల్పమని, ఇంకా సాధించాల్సింది చాలా ఉందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా రుణమాఫీ డబ్బులు విడుదల చేస్తారని ఎదురుచూసిన రైతుల ఆశలు ఆవిరయ్యాయి. సమగ్ర పంటల బీమా పథకం, సమగ్ర విత్తన విధానం లేకపోవడం మూలంగా లక్షల ఎకరాల్లో పంటలు ప్రకృతి వైపరీత్యాలకు, కల్తీ విత్తనాలకు నష్టపోవడంతో పాటు కనీసం ప్రభుత్వాల నుంచి ఆర్థిక సాయం, పరిహారం అందక రైతులు రూ.లక్షల కోట్లు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం వ్యవసాయ విధానంపై దృష్టి సారించకపోతే రాబోయే రోజుల్లో మరింత నష్టం చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు తాతా భాస్కరరావు, రాయల వెంకటేశ్వరరావు, ఎస్‌కే.మీరా, సహాయ కార్యదర్శులు దుగ్గి కృష్ణ, బిక్కసాని గంగాధర్, భూక్యా లక్ష్మా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావు పుట్టిన రోజు వేడుకలు



హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పుట్టిన రోజు సందర్భంగా సచివాలయంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అలాగే నేలకొండపల్లి పీహెచ్‌సీలో తెలంగాణ పబ్లిక్ హెల్త్ మెడికల్ అసోసియేషన్, ఆరోగ్య సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ దుర్గ, సూపర్‌వైజర్ ఏడుకొండలు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: నగరంతో పాటు రఘునాథపాలెం మండలంలోని క్లస్టర్ల పరిధిలో శనివారం రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ర్యాలీలు తీసి ఆట,పాటలతో సందడి చేశారు. వీవీపాలెం రైతు వేదికలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సీఈఓ వీరబాబు, బూడిదంపాడు రైతు వేదికలో ఆత్మచైర్మన్ భూక్యా లక్ష్మణ్ నాయక్ పాల్గొని ప్రభుత్వ పథకాలపై వివరించారు. అలాగే చిమ్మపూడిలో వైస్ ఎంపీపీ గుత్తా రవి అధ్యక్షతన రైతులందరూ గ్రామంలో ర్యాలీ తీశారు. నగరంలోని రామన్నపేట, అల్లీపురం రైతు వేదికల్లో సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గొర్రె కృష్ణవేణి, బాతులు రమణ, రావేళ్ల మాధవి, గుడిపుడి శారద, కార్పొరేటర్లు రావూరి కరుణసైదబాబు, హుస్సేన్, ఉప సర్పంచ్ కొంటే ముక్కుల వెంకటేశ్వర్లు, మండల రైతు బంధు కో ఆర్డినేటర్ దొంతు సత్యనారాయణతో పాటు వెంకటరమణ, ముత్తయ్య, డీసీఓ విజయలక్ష్మి, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, కుతుంబాక నరేష్, రావెళ్ల శ్రీను, కూరాకుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

'పుడమి' పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ ఎంపీ



సినిమా పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: కౌలు రైతుల జీవనం ఆధారంగా ఆర్.వీ.రెడ్డి బ్యానర్‌లో నంద్యాల సాయి కల్యాణ్ దర్శకత్వం వహించిన 'పుడమి'చిత్రం పోస్టర్లను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ నేపథ్యాన చిత్రీకరించిన ఈ సినిమాను అందరూ ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ బాధ్యులు నంద్యాల సాయి కల్యాణ్, చింతమళ్ల నాగరాజు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం..

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లి, పల్లెగూడెంలలో జరిగిన పలు వివాహ వేడుకలకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన పట్టు వస్త్రాలను కానుకగా అందించారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ టి.బ్రహ్మయ్య, సూదగాని ఉపేందర్, తిపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

తిరుమలాయపాలెం: మొక్కజొన్న కొనుగోళ్ల కోసం ఆర్భాటంగా మొక్కుబడి కేంద్రాలను ఏర్పాటు చేసిందని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆరోపించారు. శనివారం మండలంలోని తాళ్లచెరువులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు ప్రభుత్వం అని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాల వద్ద కంటికి కునుకు లేకుండా రైతులు జాగారం చేస్తుంటే నేటికీ కొనుగోళ్లు చేయలేదని, వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం నేటి వరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములు, నాగేశ్వరరావు, ఆశీర్వాదం, వెంకటేశ్వర్లు, వెంకన్న, మోహన్, రమేష్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

ఖమ్మం సహకారనగర్: యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుడు, సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని కాకతీయ విశ్వవిద్యాలయ యూనివర్సిటీ పీజీ కళాశాల నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 38 ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగులు, అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసిన విధంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులనూ రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ నెల 6వ తేదీన యూనివర్సిటీ ఉన్నతాధికారులతో నిర్వహించే సదస్సుకు అధిక సంఖ్యలో తరలిరావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, గోపి, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హక్కు పత్రాలు ఇవ్వాలి

ఖమ్మంఅర్బన్: అర్హత కలిగిన ప్రతీ గిరిజన రైతులకు అటవీ హక్కు పత్రాలు, గిరిజన బంధు పథకాలను తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో అందించాలని సేవాలాల్ సేన రాష్ట్ర రైతు అధ్యక్షుడు బానోత్ కిషన్‌నాయక్ కోరారు. శనివారం నగరంలోని విజయనగర్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి సాగు చేస్తున్న రైతులకు మొత్తం 11.30 లక్షల ఎకరాల్లో నాలుగు లక్షల ఎకరాలు భూమి మాత్రమే పంపిణీ చేస్తుందన్నారు. సాగు చేసుకుంటున్న ప్రతీ రైతుకి హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిక్కినాయక్, బానోత్ రాజు నాయక్, భూక్యా భిక్షపతి రాథోడ్, జర్పుల భీముడునాయక్, మోతిలాల్ నాయక్, బి.సైదులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సౌకర్యవంతంగా కార్యాలయాలు



పనులను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్

రఘునాథపాలెం: ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులతో పాటు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా భవనాల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. రఘునాథపాలెంలో రూ.50లక్షల చొప్పున నిధులతో నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ల భవనాలను కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో శనివారం ఆయన పరిశీలించారు. మొక్కలు నాటడంతో పాటు టాయిలెట్లు, తాగునీరు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 10న భవనాలను ప్రారంభించేలా పనులు పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఏసీపీ రామోజీ రమేష్, పీఆర్ డీ శ్రీనివాసరావు, తహసీల్దార్ నర్సింహారావు, జెడ్పీటీసీ ప్రియాంక, ఏఈ ఆదిత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కందాల విస్తృత పర్యటన



కూసుమంచి: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

కూసుమంచి/తిరుమలాయపాలెం: మండలాల్లోని రైతువేదికలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవ వేడుకలకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి హాజరయ్యారు. శనివారం కూసుమంచి రైతువేదికలో నిర్వహించే వేడుకలకు ఎడ్లబండిపై ర్యాలీగా వేదిక వద్దకు చేరుకుని తెలంగాణ ప్రభుత్వం రైతాంగానికి చేసిన మేలులను వివరించారు. అలాగే తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు, పాతర్లపాడు, హస్నాబాద్‌లలో జరిగిన వేడుకలకు హాజరై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్, ఎంపీడీఓ జయరాం, చావా వేణుగోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కూసుమంచి మండలంలోని రాజుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ప్రారంభోత్సవంతో పాటు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలకు గ్రామ వాస్తవ్యులైన ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కుటుంబసభ్యులతో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దంపతులు హాజరై పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రభుత్వ రంగంలో వైద్య సేవలు పెంచాలి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: విద్య, వైద్యరంగాలను పూర్తిగా ప్రభుత్వపరం చేయడమే కాక ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల సంఖ్య పెంచి సేవలు విస్తృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సీపీఎం టూటౌన్ కమిటీ, బీవీకే ఆధ్వర్యాన ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ.. సీపీఎం నిర్వహించే వైద్యశిబిరంలో ప్రతి నెలా ఒక ప్రత్యేక వైద్య నిపుణుడితో ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. కాగా, శిబిరానికి డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు కుమార్తెలు బాల శ్రీవల్లిక, నాగమల్లిక రూ.15 వేలు విలువైన మందులు అందజేయగా, వైద్యులు సి.భారవి, రావిళ్ల రంజిత్, పి.సుబ్బారావు, జెట్ల రంగారావు పలువురిని పరీక్షించారు. నాయకులు వై.శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, సుబ్బారావు, పి.ఝాన్సీ, అఫ్జల్, వాసిరెడ్డి వీరభద్రం, నర్రా రమేష్, కాంపాటి వెంకన్న, కళ్యాణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

12శాతం రిజర్వేషన్ కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: మైనారిటీలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తుమ్మలగడ్డ మసీద్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని పువ్వాళ్ళ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ముస్లింలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేసి డీఆర్వో శిరీషకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్బాస్, సయ్యద్‌గౌస్, ముజాహిద్, వసీం, ఇబ్రహీం, జానీ, జాఫర్, బుడాన్ తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట' ర్యాలీ



ర్యాలీలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు, సీఆర్పీ మోహన్‌లు కాంప్లెక్స్ పరిధిలోని రామకృష్ణాపురం, గోపాలపురం గ్రామాల్లో విద్యార్థుల ఇంటింటికి తిరిగి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు.

ఆలయాల్లో దీపోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి, కమాన్‌బజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి, కాల్వొడ్డులోని శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవాలయాల్లో దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జిల్లా ఫ్యామిలీ కోర్టు జడ్జి అర్చనాకుమారి పాల్గొని దీపాలు వెలిగించి దీపోత్సవంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయకమిటీ, దేవాదాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచన తప్పనిసరి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రస్తుత కాలంలో దేశంలోని ప్రతీ విద్యార్థికి శాస్త్రీయ ఆలోచన తప్పనిసరి అవసరమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్, వ్య.కా.స. జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ శిక్షణ తరగతులు ప్రారంభించాక వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చరిత్రను వక్రీకరించేలా విద్యా విధానంలో అనేక మార్పులు తీసుకొస్తుందని, దీని వల్ల విద్యార్థులకు కనీసం శాస్త్రీయ ఆలోచన, రాజకీయ విలువలు తెలియకుండా పోతుందని తెలిపారు. విద్యార్థులు ఎస్ఎఫ్ఐ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్ వర్మ, రాష్ట్ర నాయకులు మిస్రీన్ సుల్తానా, బి.వీరభద్రం, జిల్లా అధ్యక్షుడు టి.ప్రవీణ్, నాయకులు ప్రశాంత్, శైలజ, తరుణ్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన బి.వీరభద్రం(60) శనివారం మృతి చెందగా వైఎస్సార్‌టీపీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ కోఆర్డినేటర్ రాము, నాయకులు కె.బాలాజీ, పి.సైదులు, ఏ.రాములు, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డుల ఉద్యమం



నేలకొండపల్లి: కోరట్లగూడెంలో రాసిన పోస్టుకార్డులతో రైతులు, నాయకులు

తిరుమలాయపాలెం/ కూసుమంచి/ నేలకొండపల్లి: 2018 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ ఎందుకు చేయలేదంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. శనివారం కూసుమంచి మండలం గురువాయిగూడెం, తిరుమలాయపాలెం మండలం తాళ్లచెరువులో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్‌సెల్ నాయకులు, నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంలో కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డులు రాసి పంపించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ చేయకుండా రైతు దినోత్సవం ఎలా జరుకుంటారని ప్రశ్నించారు. తాళ్లచెరువులో జరిగిన కార్యక్రమంలో నాయకులు పి.నాగేశ్వరరావు, రాములు, మోహన్, రాజశేఖర్ తదితరులు పాల్గొనగా.. గురువాయిగూడెంలో కిసాన్‌సెట్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి రమేష్‌రెడ్డి, కోరట్లగూడెంలో కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, రైతులు కొత్తపల్లి సుబ్బయ్య, గుండా శంభయ్య, తోట సబ్బారావు తదితరులు పాల్గొన్నారు.